# అంచనా

రామం ఇంట్లో అడుగు పెడుతూనే పక్క వాటాలోంచి వినిపిస్తున్న పిల్లల గోల విని అదిరిపోయాడు. వెంటనే భార్యని పిలిచి "పక్క వాటాలోకి ఎవరైనా దిగారా" అన్నాడు కాస్త గొంతు తగ్గించి.

"ఆ వచ్చారు" అంది కమల.

"గోల కాకేమిటి ? గంపెడు పిల్లలు- జానెడు కొంప" అంది.

"ఎంత మంది పిల్లలు ?"

"ఐదుగురు మగ పిల్లలు. మళ్ళీ...." కమల కిసుక్కుమని నవ్వింది.

"హు.... అందుకే దేశమిలా వుంది" అని నిట్టూర్చి బూట్లు విప్పి లోపలి కెళ్ళాడు.

పక్క వాటాలోంచి కు స్త్రీల అరుపులు, మధ్యలో ఏడుపులు వినిపిస్తున్నాయి.

రామం మంచి బ్యాంక్ ఉద్యోగంలో వున్నాడు. నాలుగు వేలు జీతం. ఇద్దరే పిల్లలు. దర్జా అయిన అద్దె ఇల్లు. చక్కని ఫర్నిచర్ - ముచ్చటైన హాబీలు పిల్లలకి ఖరీదైన చదువులు - భార్యకి ఫ్యాషనయిన చీరలు -

రామం, కమల ఆదర్శ దంపతులని చెప్పక తప్పదు. ఈ అధునాతన జీవన సరళిలో వ్యసనాలు లేకుండా సాటివారి పట్ల సానుభూతి కలిగి, పేదవాళ్ళంచే కాస్త దయ కలిగి, ఏదైనా వుంచే లేని వారికి పెట్టే మంచిగుణం భార్యాభర్తలకిద్దరికీ వుంది. నిజానికి కమల కంచే రామానికి జాలి, దయ పాలెక్కువ. అతనెవర్ని చూసినా ముందు జాలి పడిపోయి బాధపడిపోతాడు.

అందుకే పక్కింటి సోమయాజుల్ని చూసి బోలెదంత జాలి పడటం మొదలుపెట్టాడు. దానికి కారణం సోమయాజులికి గంపెడు సంతానం-, చిన్న ఉద్యోగం.

కమల చాలా మితభాషి. సమాన ఆర్థిక హోదా గలవారితో గానీ చనువుగా మాట్లాడదు. దూరంగా, దర్పంగా వుంటుంది. ఆమె తనని మధ్య తరగతి గృహిణిగా ఎప్పుడూ అనుకోదు. తన భర్త ఉద్యోగం దృష్ట్యా తను హైక్లాసులో

చేరినట్లు భావిస్తుంది. అందుకే మరీ అట్టడుగు వాళ్ళని ఆదరించి మాట్లాడుతుంది గానీ, సోమయాజులు భార్య తాయారు లాంటివాళ్ళంటే ఆమెకి బొత్తిగా అసక్తి లేదు.

పిల్లలు రమ, రమేష్ ఖరీదైన కాన్వెంట్‌లో చదువుకుంటున్నారు. అయినా రమేష్ అరగంటలో పక్కింటి మగపిల్లలతో జత కట్టేశాడు, ఇక ఒకటే ఆటలు.

సోమయాజులు దిగిన వాటా చాలా చిన్నది. ఒక గది, ఒక వంట గది. కాస్త సామాను-నాలుగు చాపలు, బియ్యాలు, పప్పులూ, ఉప్పులూ-

రామం గుండె జాలితో కరిగి నీరై పోయింది. ధరలు ఆకాశానికంటుతున్న ఈ రోజుల్లో సోమయాజులు బండి ఎలా లాగుతున్నాడా అని వాపోయాడు. వెంటనే కమలని పిలిచి "పాపం, వాళ్ళనొక కంట కనిపెట్టిచూడ"మని చెప్పాడు రామం వచ్చిన జీతం డబ్బులు దర్జాగా ఖర్చు పెట్టి, ఎంతో కొంత చేతిలో పెట్టుకొని, నెలంతా జాగ్రత్తగా గడుపుతాడు. కానీ పైకి మాత్రం జమిందారు హోదా కనబరుస్తాడు.

* * *

ఆ రోజు సోమయాజులు ఆఫీసు నుంచి వస్తూ గాంధీబొమ్మ గుడ్డ సంచీలో ఒక శేరు బఠాణీలు, ఉప్పు శనగలు తీసుకొచ్చాడు. వస్తూనే రమని పిలిచి ఆ పిల్ల దోసిట్లో యిన్ని బఠాణీలు, శనగలూ పోసి, ప్రేమగా బుగ్గ నిమిరి, ఆ తర్వాతనే తన మొగ పిల్లలందరికీ పెడుతూ, రమేష్‌కి కూడా పెట్టాడు.

ఆ రాత్రి భోజనాల దగ్గర కమల భర్తతో అంది: "పక్కింటాయనకి ఆడ పిల్లలంటే ఎంతో మోజట. అయిదుగురూ మొగ పిల్లలేననీ, ఆమె సావిత్రి గౌరీదేవి నోము నోచిందట-, ఇదిగో ఇప్పుడు మళ్ళీ....మన రమంటే ఎంత ఇష్టమో" అంది

"బాగానే వుంది చాలీ చాలని జీతాలతో ఇంతమంది పిల్లలు. పైగా ఆడపిల్ల మోజు సర్లే! ఆయన పిల్లలకి బఠాణీ, ఉప్పు శనగలు కొనకపోతే చాక్లెట్లు కేకులు కొనగలడా మరి" అన్నాడు రామం ఫ్రిజ్‌లో చల్లబడిన పెరుగు ఆప్యాయంగా కలుపుకుంటూ

"అవునూ! ఆయన ప్రతీదీ తీసుకొచ్చి మన పిల్లలకి పెడతాడు వద్దంటే బాగుండదని ఊరుకుంటున్నా- తీరా మనం కొనేవి వాళ్ల పిల్లలకి పెట్టాలంటే కుదిరేపని కాదు కదా!" అంది కమల.

రామం కాస్సేపు ఆలోచనలో పడిపోయాడు. ఇదొక సమస్యగా మారే ప్రమాదం కనిపించింది. తనంత మంది పిల్లలకి ఏం కొనగలడు? తనెప్పుడూ ఖరీదైన తినుబండారాలు కొంటాడు అలాంటివి ఏడుగురికి కొనాలంటే ముప్పై, నలభై రూపాయలారిపోతాయి. అయినా ఈ పేద బ్రాహ్మణుడికిదేం బుద్ధి? తనకున్న పిల్లలు చాలరన్నట్లు చుట్టుపక్కల వాళ్ళకి కూడా పంచిపెడ్తాడు.

* * *

ఆ రోజు సోమయాజులు తనే మడికట్టుకుని వంటచేసి ఆఫీసు కెళ్ళాడు. రామం ఆశ్చర్యపోయి భార్య నడిగాడు.

"ఆమె లేవలేక పోయిందట. చూడండి! ఆ మగాడు అందరి పిల్లలకీ అన్నం వండి, కూర, పులుసు, పప్పు వండి పెట్టి వెళ్ళాడు" అంది కమల మెచ్చుకోలుగా.

"ఏం చేస్తాడు, పేదవాడు. వెనకేం లేనివాడు, చిన్న జీతం అంతకంటే ఏం చేస్తాడు? ఇష్టమున్నా లేకపోయినా ఆడపిల్ల కోసం ఛాన్సులు చూస్తున్న వాడికి తప్పేదేముందీ అన్నాడు చులకనగా.

అవును మరి, అలాంటి సందర్భం వస్తే రామం హోటలు నుండి క్యారేజి తెప్పిస్తాడు గానీ చెయ్యి కాల్చుకోడు. రామం ఈసారి సోమయాజుల్ని చూసి మరీ బాధపడిపోయాడు.

అయితే తాయారు కట్టుకునే గుంటూరు, పేటేరు మాధవరం జరీ చీరలు చూసి కమల ఆశ్చర్యపడకపోలేదు. పాపం, కనీసం కోరుకున్న గుడ్డ ముక్కైనా లేకపోతే ఎలా?" అని వెంటనే సర్దుకునేది. అత్యంత రుచిగా చేసిన గుమ్మడికాయ పులుసు, మామిడికాయ పప్పు లాంటివి తాయారు అభిమానంగా అందిస్తుంటే మొహమాటంగా పుచ్చుకుంటూ "ఎందుకండీ! ఇవన్నీనూ-, అసలే మీకు ఇబ్బంది, శ్రమ" అనో "ధరలు మండిపోతుంటే ఏమిటి మీ చాదస్తం మరీనూ" అనో అనేది.

అయితే తాయారు మాత్రం "మరేం ఫర్వాలేదులెండి", అంటూ చిరునవ్వుతో అవి ఇంట్లో పెట్టి వెళ్తూండేది.

* * *

మూడు నెలలు గిర్రున తిరిగిపోయాయి. ఆరోజు సాయంత్రం రామం విశ్రాంతిగా కూర్చుని కాఫీ తాగుతున్న సమయంలో సోమయాజులు నెమ్మదిగా వచ్చాడు. అతని వాలకం చూసి, డబ్బేమైనా అవసరమై అప్పు కోసం వచ్చి వుంటాడని

రామం అనుకున్నాడు. అనుకోవడమే తడవుగా అతనికి సాయం చెయ్యాలని కూడా నిర్ణయించుకున్నాడు.

"రండి కూర్చోండి" అన్నాడు రామం సాదరంగా, సోమయాజులు కుర్చీలో కూర్చుంటూ "నాకు ట్రాన్స్‌ఫర్ అయిందండీ" అన్నాడు.

"అలాగా ? ఎక్కడికి" అన్నాడు రామం. అయ్యో ఈ పేద వాడేమై పోతాడాని తల్లడిల్లిపోతూ-

అతను నెమ్మదిగా నవ్వి "మా ఊరికే-, నేను అక్కడ్నించే వచ్చాను. గిట్టనివాళ్ళు చేయించిన పని.

మీ ఊరు ?

సోమయాజులు చెప్పాడు.

"అక్కడ మాకు ఒక వంద ఎకరాల దాకా పొలం వుంది. ఈమధ్య నాగార్జునసాగర్ కుడి కాలువ వచ్చేక ఏభై ఎకరాల వరకు వరి పండుతోంది. నేనేదో ఉద్యోగం చేసుకుంటున్నానని, నా మీద గిట్టని వాళ్ళు బదిలీ చేయించారు. ఒక్కడ్నీ ఎక్కడా వుండే అలవాటు లేదు. పిల్లల్ని చూడకుండా వుండలేను. అందుకే ఏదో చిన్న ఇంట్లో ఈ మూడునెలలు గడిపేశాము. మాఊరి ఎం.ఎల్.ఎ. గారితో చెప్పి మళ్ళీ, మా ఊరు వేయించుకున్నాను.

రామం అప్పటికే శిలా ప్రతిమై పోయాడు. "మీ లాంటి పొరుగు దొరకడం మా అదృష్టం అని నేనూ, మా ఆవిడా ఎప్పుడూ అనుకుంటాం-" అంటూ ఆగాడు. ఇంతలో ఒక కూలి మనిషి రెండు మూటలు తెచ్చి వారగా పెట్టాడు.

"మా చేల గట్లమీద కందీ, మినుము వేశాం. ఈసారి పంట బాగా వచ్చింది. మీరు వాడుకోండి" అంటూ సోమయాజులు మళ్ళీ నమస్కరించి అత్యంత వినయంగా నమ్రతగా కదిలి వెళ్ళిపోయాడు.

దూరంగా రేడియోలోంచి ఏనాటిదో పాత పాట

'సత్తు చిత్తుల భేదము తెలియక
చిత్తును సత్తనుకున్నావు - నా
ఎత్తులెరుగకున్నావు - ఓ మనసా'

అని లీల కంఠంలోంచి ఖంగుమని మోగుతోంది.

2-9-'88 — (ఆంధ్రజ్యోతి)